క్లుప్తంగా

రేపటి నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు

పి.గన్నవరం: ముంగండ చింతామణి గణపతి మందిరంలో ఈనెల 9 నుంచి 11 వరకూ సంగీత జగద్గురు త్యాగరాజ స్వామి వారి 47వ ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్టు సమితి అధ్యక్షుడు ఖండవిల్లి నాగేశ్వరరావు తెలిపారు. త్యాగరాజ స్వామి, రామచంద్ర స్వామి వార్లకు ప్రత్యేక పూజలు జరుగుతాయని వివరించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సంగీత కళాకారులతో గాత్ర సంగీత సభలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా లక్ష తులసి పూజ

ఆలమూరు: మండలంలో చింతలూరులోని ధన్వంతరిస్వామి వారి ఆలయంలోని శ్రీశ్ర, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం వైభవంగా లక్ష తులసి పూజ జరిగింది. ధనుర్మాసం పవిత్రతను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో నూకాంబికా బ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో వేద పండితులు రాళ్లపల్లి శర్మ మంత్రోచ్ఛారణల మధ్య బ్రాహ్మణ పండితులు ఈ పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని లక్ష తులసి పూజను తిలకించారు. అనంతరం దేవతామూర్తులను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

కొమరాజులంకలో...

రావులపాలెం: మండలంలోని కొమరాజులంకలో వేంచేసిన శ్రీ, భూ సమేత జనార్దన స్వామి ఆలయంలో శనివారం లక్ష తులసి పూజ వైభవంగా నిర్వహించారు. అర్చకుడు కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే పార్వతీ వీరేశ్వరస్వామికి కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పార్టీలకు అతీతంగా అర్హులందరికీ పింఛన్లు

ఎమ్మెల్యేలు వరప్రసాదరావు, చిట్టిబాబు

మామిడికుదురు: కుల మతాలకతీతంగా, పార్టీ రహితంగా అర్హులందరికీ పింఛన్లు ఇస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాజోలు, పి.గన్నవరం ఎమ్మెల్యేలు రాపాక వరప్రసాదరావు, కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం జరిగిన సభలో మండల పరిధిలోని 322 మందికి కొత్తగా మంజూరైన పింఛన్లను ఎమ్మెల్యేలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో వరప్రసాదరావు, చిట్టిబాబు మాట్లాడుతూ పింఛన్లకు అర్హత వయస్సును 65 నుంచి 60 ఏళ్లకు తగ్గించి అయిదేళ్ల ముందుగానే పింఛన్లు ఇస్తున్న మహోన్నత వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రజలకిచ్చిన హామీ మేరకు పింఛన్ సహాయాన్ని రూ.రెండు వేల నుంచి రూ.2,750కు పెంచారన్నారు. ఆర్థికంగా ఎంత భారమైనప్పటికీ ఎక్కడా రాజీ పడకుండా సీఎం ఎంతో సాహసోపేతంగా ప్రతి సంక్షేమ పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ ఖాదర్, జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, నగరం ఏఎంసీ చైర్మన్ నక్కా కృష్ణవేణి, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, స్థానిక సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, పీఏసీఎస్ చైర్మన్ కటకంశెట్టి ఆదిత్యకుమార్, ఎంపీటీసీ వర్ధినేని రాము, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, నక్కా వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు సూరిశెట్టి బాబి తదితరులు పాల్గొన్నారు.



మామిడికుదురులో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేలు వరప్రసాదరావు, చిట్టిబాబు

నియోజకవర్గంలో కొత్త పింఛన్ల పంపిణీ: ఎమ్మెల్యే రాపాక

మలికిపురం/రాజోలు/సఖినేటిపల్లి: పింఛన్‌దారుల ఆత్మ గౌరవాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరింత పెంచారని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. కత్తిమండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వాలు అరకొర పింఛన్లను అందించి వృద్ధులను వికలాంగులను అవమానపరిచాయని అన్నారు. సంక్షేమ పథకాల అమలులో అవినీతికి తావు లేకుండా అమలు చేస్తున్న ప్రభుత్వం కూడా ఇదేనని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి, డీసీఎంఎస్ డైరెక్టర్ అడబాల వీర బ్రహ్మాజీరావు, సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షులు ముత్యాల కాశి, జెడ్పీటీసీ మట్టా శైలజ, సూర్యబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కోటిపల్లి ఎస్తేరు రాణి, జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, వైఎస్ ఎంపీపీ 1, 2 రాపాక దీవెన కుమారి, రుద్రరాజు చినరాజా పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు బియ్యం అందజేత

రావులపాలెం: స్థానిక కొత్తకాలనీలో ఈ నెల ఆరోతేదీ తెల్లవారుజామున సంభవించిన అగ్ని ప్రమాదంలో నష్టపోయి బాధితులకు వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం ప్రభుత్వం తరఫున 50 కేజీల బియ్యం అందజేశారు. నాగు, పుల్లమ్మలకు వైస్ ఎంపీపీ బొక్కా ప్రసాద్ చేతుల మీదుగా ఈ సాయాన్ని అందజేశారు. అలాగే దాతల సమకూర్చిన మరో 100 కేజీల బియ్యాన్ని బాధిత కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఆదిరెడ్డి, గోపి, నాగమణి, నాగేశ్వరరావు, జ్యోతి పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

మలికిపురం: ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని గొల్లపాలెం సర్పంచ్ మందపాటి నాగేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని గొల్లపాలెం ఆర్బీకే వద్ద ఆరోగ్య శాఖ, అంగన్‌వాడీ, వెలుగు విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఆరోగ్య సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలు, ప్రత్యేకంగా గర్భిణులు వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా రక్తహీనత రాకుండా వైద్య సూచనలు పాటించి, మందులు వాడాలన్నారు. ఆరోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు గ్రామాల్లో అందుబాటులో ఉండి మాత్రలను అందిస్తున్నారని వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

ఆత్రేయపురం: లేఅవుట్‌లో గృహాలు మంజూరై ఇంకా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించని వారు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి ఎంవీ రామారావు, ఎంపీడీవో నాతి బుజ్జి కోరారు. శనివారం మండలంలోని రాజవరంలో జగనన్న హౌసింగ్ కాలనీలో గృహ నిర్మాణ లబ్ధిదారులతో సర్పంచ్ జానమంగాయమ్మ, మాజీ సర్పంచ్ కోమలి సత్యనారాయణ అధ్యక్షతన సమావేశం నిర్వహించి గృహ నిర్మాణాలపై అవగాహన కల్పించారు. ఇప్పటికే జగనన్న హౌసింగ్ కాలనీలో రోడ్లు, విద్యుత్, వాటర్ సదుపాయాలు కల్పించామన్నారు. హౌసింగ్ ఏఈ వెంకటరెడ్డి, హౌసింగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల లక్ష్యాలను అధిగమించాలి

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల అభ్యున్నతి కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అధిగమించాలని ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ అన్నారు. ఆలమూరు ఎంపీపీ కార్యాలయంలో గ్రామ సచివాలయ ఉద్యోగులతో మండల అభివృద్ధి, పథకాల అమలుపై శనివారం సమీక్ష జరిగింది. ప్రభుత్వ పథకాలు అమలు-గ్రామ సచివాలయ ఉద్యోగుల పాత్రను వివరిస్తూ ఎంపీడీఓ జాన్‌లింకన్ ప్రసంగించారు. అర్హులైన లబ్ధిదారులందరికి సంక్షేమ పథకాలను గ్రామ వలంటీర్లతో అందించవలసిన బాధ్యత సచివాలయ సిబ్బందిదేనని తెలిపారు. గ్రామాల్లో శాఖల వారీగా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో పూర్తయిన అభివృద్ధి పనులకు సంబంధించి సత్వరమే అంచనాలు రూపొందించే విధంగా ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ కోరారు. అలాగే పనుల నాణ్యతపై రాజీ పడవద్దని విజ్ఞప్తి చేశారు. ఈఓపీఆర్డీ పీఆర్‌సీ రాజ్‌కుమార్, సూపరింటెండెంట్ వి.రామస్వరూప్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన

రావులపాలెం: హనుమాన్ జయంతి పురస్కరించుకుని శనివారం స్థానిక అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. వందలాది మంది బారులు తీరి స్వామి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

14న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

కొత్తపేట: స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1979 నుంచి చదువుకున్న విద్యార్థులతో ఈ నెల 14న ఉదయం 10 గంటలకు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.అరుణ్‌కుమార్ తెలిపారు. కళాశాల అభివృద్ధి, మౌలిక సౌకర్యాల కల్పనలో పూర్వ విద్యార్థుల సూచనలు, సలహాలు, సహాయ, సహకారాల భాగస్వామ్యాన్ని కల్పించాలనే ఉద్దేశంతో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు వారు తెలిపారు. ఈ కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఈ చదువులమ్మ చెట్టు నీడలో ఆత్మీయ సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఇతర వివరాలకు 6305698749, 9492122277 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

లక్కీ షాపింగ్ మాల్ ప్రారంభం



షాపింగ్ మాల్‌లో పట్టు చీరలను పరిశీలిస్తున్న సినీ తారలు అనసూయ, నేహాశెట్టి

పెద్దాపురంలో సినీతారల సందడి

పెద్దాపురం: స్థానిక దర్గా సెంటర్‌లో లక్కీ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో శనివారం సినీ తారలు సందడి చేశారు. అనసూయ (జబర్దస్త్ ఫేమ్), నేహాశెట్టి (డీజేటిల్లు ఫేమ్)ల చేతుల మీదుగా ఈ మాల్ ప్రారంభించారు. తొలుత షాపింగ్ మాల్ అధినేతలు శ్రీను, రత్తయ్య, స్వామి ఆధ్వర్యంలో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు మట్టే సత్యప్రసాద్, మట్టే శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు, ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, ఆగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ తదితరులు మాల్‌ను సందర్శించి మాట్లాడారు. లక్కీ షాపింగ్ మాల్ బ్రాంచ్ పెద్దాపురంలో ఏర్పాటు చేయడం పట్టణాభివృద్ధికి శుభసూచికమన్నారు. తక్కువ ధరకే నాణ్యమైన వస్త్రాలను అందించడం మంచి పరిణామమన్నారు. అనంతరం సినీతారలు అనసూయ, నేహాశెట్టి మాల్ వద్దకు వచ్చేసరికి అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ వస్త్ర ప్రపంచంలో లక్కీ షాపింగ్ మాల్‌కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఆటువంటి నాణ్యత, అద్భుతమైన షాపింగ్ అనుభూతినందించే సువిశాలమైన షోరూమ్ ఇక్కడ ఏర్పాటు చేయడం అభినందనీయమని అనసూయ, నేహాశెట్టి అన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి మాల్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో బిల్డింగ్ యజమాని గోమాడ సూరిబాబు, కంకటాల ఎండీ కంకటాల మల్లిక్, వార్డు కౌన్సిలర్ విడదాసరి రాజా, వైఎస్సార్ సీపీ నాయకులు గోపు మురళి, కనపర్తి చీమదొర, టీడీపీ నాయకులు బొడ్డు బంగారుబాబు, తూతిక రాజు, నాళం సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేసి మాల్‌ను ప్రారంభిస్తున్న దొరబాబు, మట్టే శ్రీనివాస్

రక్తహీనత నివారణపై దృష్టి సారించాలి


ఆలమూరు: చింతలూరు, పినపళ్ల గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో శనివారం సుస్థిర అభివృద్ధి-లక్ష్యాలు అనే అంశంలో భాగంగా రక్తహీనత నివారణపై సమీక్ష జరిగింది. ఆయా గ్రామాల సర్పంచ్‌లు మార్గాని కరుణ, సంగిత సుభాష్ అధ్యక్షతన నిర్వహించిన సమీక్షలో పెదపళ్ల పీహెచ్‌సీ సూపర్‌వైజర్ పీవీ రమణారావు పాల్గొని ప్రసంగించారు. మహిళల్లో తరచూ ఇబ్బందులకు గురిచేస్తున్న రక్తహీనతను అధిగమించేందుకు వైద్యారోగ్య సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం 67 శాతంగా ఉన్న రక్తహీనత సమస్యను రాబోయే కాలంలో తొమ్మిది శాతానికి తగ్గించేలా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించిందన్నారు. ఎంఎల్‌హెచ్‌పీలు వి.సువర్చల, కె.కళాంజలి, ఏఎన్‌ఎంలు పి.కృష్ణవేణి, ఎస్ఆర్ ప్రియదర్శిని, కె.వెంకాయమ్మ, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



చింతలూరులో రక్తహీనతపై అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

పేకాట శిబిరంపై దాడి

ఐ.పోలవరం: కొద్ది రోజులుగా గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. పశువుల్లంక శివారు గోదావరి తిప్పపై పేకాటాడుతున్నట్లు అందిన ముందస్తు సమాచారం మేరకు ఎస్సై ఎస్.రాజేష్ సిబ్బందితో కలసి దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న 14 మందిని అదుపులోకి తీసుకుని, రూ.2.87 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



నాగరాజుకు అభినందనలు

రావులపాలెం: శాప్ అథ్లెటిక్ లీగ్ స్టేట్ లెవెల్ మెన్ షార్ట్‌పుట్‌లో రావులపాలేనికి చెందిన కె.నాగరాజు తృతీయ స్థానంలో నిలిచాడని అథ్లెటిక్స్ జిల్లా సెక్రటరీ రవితేజ తెలిపారు. స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో శనివారం జరిగిన కార్యక్రమంలో పలువురు ప్రముఖులు నాగరాజును అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ భీమారెడ్డి, రెడ్డి డ్రగ్స్ అధినేత కొవ్వూరి నరేష్‌కుమార్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై కేసు

కొత్తపేట: మైనర్ బాలికను పెళ్లి చేసుకున్న యువకుడిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వి.మణికుమార్ తెలిపారు. స్థానిక రెడ్డప్పవారిపేటకు చెందిన 17 సంవత్సరాల బాలికను ఇంట్లో ఎవరూ లేని సమయంలో వాడపాలెం పెద పేటకి చెందిన యువకుడు గత నెల 30న బాలికను తీసుకువెళ్లి 31న స్థానిక కొత్తరామాలయం ఆంజనేయస్వామి గుడి వద్ద తాళి కట్టాడు. తరువాత ఆమెను తీసుకుని తన ఇంటికి వెళ్లగా యువకుడి తండ్రి ఇంట్లోకి రావడానికి ఒప్పుకోలేదు. దాంతో ఇద్దరూ బాలిక ఇంటికి వెళ్లారు. బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దానిపై హెచ్‌సీ ప్రసాద్ వెళ్లి విచారణ చేసి, మైనర్‌ను పెళ్లి చేసుకున్నట్టు నివేదించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వైద్య పరీక్షలు తప్పనిసరి

అంబాజీపేట: ప్రతి ఒక్కరూ ఆరు నెలలకోసారి వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కంపూడి కిరణ్, పార్టీ నాయకుడు కొండేటి వికాస్, ఐపీఎల్ క్రికెటర్ బండారు అయ్యప్ప అన్నారు. వాలకగరువులో ఫెండ్స్ ఫరెవర్ హెల్పింగ్ ఆర్గనైజేషన్ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వాకలగరువులో ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలను శనివారం నిర్వహించారు. ఆర్గనైజేషన్ నూతన క్యాలెండర్‌ను వీరు ఆవిష్కరించారు. రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన వేంకటేశ్వరుని ఆలయం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. స్వామిని అధి క సంఖ్యలో దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి కానుకలు, మొక్కులు చెల్లించారు. చిన్నారులకు తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

ఘనంగా లక్ష తులసి పూజ



అంబాజీపేటలో వేంచేసియున్న సీతారాములు

అంబాజీపేట: స్థానిక పెద్దవీధిలో వేంచేసిన సీతారామచంద్ర స్వామి ఆలయంలో స్వామికి లక్ష తులసి పూజను శనివారం ఘనంగా నిర్వహించారు. యర్రాప్రగడ సూర్యప్రకాష్ సోదరుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఖండవిల్లి బదరినారాయణాచార్యులు, ఆనందవర్ధనం బ్రహ్మత్వంలో స్వామికి లక్ష తులసి పూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ర్యాలి జగన్మోహినీ కేశవస్వామికి పూజలు

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో ఓఎన్జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్ఎం పాటిల్ స్వామి వార్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు రావులపాలెం జెడ్పీటీసీ కుడిపూడి శ్రీనివాసరావు, ఆలయ ఈవో కృష్ణచైతన్య ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి వార్ని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆయనకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు.

వక్ఫ్ బోర్డు స్థలం పరిశీలన



కొమరాడలో ఆక్రమణకు గురైన వక్ఫ్ బోర్డు స్థలాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ అబ్దుల్ ఖాదర్

మామిడికుదురు: కొమరాడలో ఆక్రమణకు గురైన వక్ఫ్ బోర్డు స్థలాన్ని ఆ బోర్డు జిల్లా చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ శనివారం పరిశీలించారు. గ్రామంలో 40-6 సర్వే నంబర్‌లో కబరిస్తాన్‌కు చెందిన 11 సెంట్ల భూమి ఆక్రమణకు గురైందని వక్ఫ్ బోర్డు డైరెక్టర్ ఎండీపై షరీఫ్ చైర్మన్ ఖాదర్‌కు వివరించారు. ఈ విషయా న్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఆక్రమణ నుంచి కబరస్తాన్ భూమికి మోక్షం కల్పిస్తానని ఖాదర్ తెలిపారు. ఆయన వెంట డైరెక్టర్లు మహ్మద్ అబ్దుల్ రబ్బాని, కర్రార్ హుస్సేన్, మొహ్మద్ అహ్మద్ అలీషా, ఆషిక్, షేక్ ఇస్మాయిల్, జాఫర్ హుస్సేన్ ఉన్నారు.

బైక్‌లో దూరిన పాము

అంబాజీపేట: గ్రామ శివారు సత్యసాయి నగర్‌లో శుక్రవారం రాత్రి మట్టపర్తి పవన్‌కు చెందిన మోటారు బైక్‌లో నూనె పరుగుడు పాము దూరి హల్ చల్ చేసి భయభ్రాంతులకు గురి చేసింది. మోటారు బైక్ సీటు కింద ఉన్న పామును స్థానికులు చాకచక్యంగా పట్టుకుని హతమార్చారు.

40 మంది బైండోవర్

మలికిపురం: మండలంలోని కోడి పందేల బరులు నిర్వహించడంతో పాటు కోళ్లకు కత్తులు కట్టే 40 మంది వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై హరికోటి శాస్త్రి శనివారం తెలిపారు. రానున్న సంక్రాంతికి కోడి పందేలు నిషేధించామని, ఈ నేపథ్యంలో అనుమానం ఉన్న వ్యక్తులతో పాటు నిర్వాహకులపై ఈ బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

ఎమ్మెల్యే పరామర్శ

మామిడికుదురు: మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నేత ములపర్తి నాగేశ్వరరావు మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. ఆదుర్రులో నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే శనివారం పరామర్శించి సానుభూతిని తెలిపారు. నాగేశ్వరరావు చిత్రపటం వద్ద పుష్పాలు ఉంచి అంజలి ఘటించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు జక్కంపూడి తాతాజీ, కుసుమ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన

అంబాజీపేట: ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన అందించేందుకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేశారని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. గంగలకుర్రు అగ్రహారంలో సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు అధ్యక్షతన శనివారం గ్రామసభ నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న ప్రజా సమస్యలను సచివాలయంలో ఉన్న అధికారులతో పరిష్కరించుకోవచ్చన్నారు. సభలో ఎంపీటీసీ విత్తనాల దుర్గాభవాని, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు. పుల్లేటికుర్రులో సర్పంచ్ జల్లి బాలరాజు అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు.

డ్రోన్ సాయంతో రీసర్వే ప్రారంభం

పి.గన్నవరం: మండలంలో డ్రోన్ ద్వారా భూముల రీసర్వే కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. తొలుత పి.గన్నవరం, పోతవరం గ్రామాల్లో డ్రోన్ ద్వారా భూముల సర్వే నిర్వహించారు. వ్యవసాయ భూములు, గ్రామ కంఠం తదితర భూముల సర్వే జరుగుతుందని డిప్యూటీ తహసీల్దార్ బి.గోపాలకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ ఎన్‌జీఎస్ఎస్ వాణి, సర్వే డీటీ పూర్ణిమ, ఆర్ఐ పి.నర్సింహారావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

పార్టీ సిద్ధాంతాలను వివరించాలి

అంబాజీపేట: టీడీపీ సిద్ధాంతాలను, ఆశయాలను నాయకులు, కార్యకర్తలు బాధ్యతగా తీసుకోవాలని మాజీ శాసనమండలి చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, నియోజకవర్గ పరిశీలకుడు యర్రా వేణుగోపాలరాయుడు, నాయకులు గంటి హరీష్‌మాధుర్, దాసరి వీవీ సత్యనారాయణ, నామన రాంబాబు అన్నారు. అంబాజీపేట, కముజువారిలంక గ్రామాల్లో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి, రచ్చబండ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

మామిడికుదురు: క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం లభిస్తుందని నగరం ఎస్సై షేక్ జానీబాషా సూచించారు. కాకినాడ నెహ్రూ యువ కేంద్రం, ఆక్సిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక దీప్తి విద్యా సంస్థల ప్రాంగణంలో జరిగిన విలేజ్ క్లస్టర్ లెవెల్ స్పోర్ట్స్ ప్రోగ్రాం శనివారంతో ముగిసింది. విద్యార్థినులు కోకో, విద్యార్థులు వాలీబాల్, షాట్‌పుట్ పోటీల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సై ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, మెరిట్ సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో దీప్తి విద్యా సంస్థల అధినేత డీవీవీ సత్యనారాయణ, అసోసియేషన్ అధ్యక్షుడు కటికిరెడ్డి గంగాధరం, పీఈటీ అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

